ప్రజాశక్తి

గురువారం 11 జనవరి 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

ఇళ్లకు షోకాజ్ నోటీసులు



దిమిలిలో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటికి నోటీసు

అంగన్‌వాడీలపై ప్రభుత్వ కక్ష సాధింపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీలను ప్రభుత్వం వెంటాడుతోంది. భయపెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేయాలన్న కుతంత్రాలు పన్నుతోంది. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయకుల, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు సచివాలయ సిబ్బందితో షోకాజ్ నోటీసులు అంటిస్తోంది. అంగన్‌వాడీలు సమ్మె శిబిరాల్లో వుంటే సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి నోటీసులు అంటిస్తున్నారు. కొన్నిచోట్ల ఇళ్ల గడులకు, ఇళ్ల గేట్లకు తగిలించి వెళ్లిపోతున్నారు. జిల్లాలో 3,517 మంది కార్యకర్తలు, సహాయకుల ఇళ్లకు నోటీసులు అంటించినట్లు ఐసిడిఎస్ అధికారులు చెబుతున్నారు. మంగళ, బుధవారాల్లో ఇళ్లకు నోటీసులు అంటించే పని పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బుధవారం నాటికి నోటీసులు అంటించినట్లు పేర్కొంటున్నారు. ఎలాగైనా విధులకు హాజరయ్యేలా చేయడమే తప్ప అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్న ఆలోచన ప్రభుత్వంలో ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు జగన్ సర్కారు తీరుపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. ఎస్మాకు, షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని, డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగుతుందని మిగతా 2లో..



కశింకోట మండలం తాళ్లపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటికి నోటీసు అంటిస్తున్న అధికారులు

వైసిపి ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ ?

- త్వరలో అధిష్టానం నుంచి ప్రకటన
- వైజాగ్ రాజకీయాల్లోకి బొత్స కుటుంబం



బొత్స ఝాన్సీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి వైసిపి అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పేరు దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. త్వరలో పార్టీ అధిష్టానం నుంచి ఆ ప్రకటన రానుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలో పలు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను వైసిపి ఇప్పటికే ఖరారు చేసింది. విజయనగరం ఎంపీ అభ్యర్థిగా మజ్జి శ్రీనివాసరావు (బొత్స మేనల్లుడు చిన్న శ్రీను) పేరు దాదాపు ఖరారైంది. ఉత్తరాంధ్రలో సీనియర్ రాజకీయ నాయకునిగా బొత్స సత్యనారాయణ పలుమార్లు మంత్రి పదవులు చేపట్టి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుండడంతో ఆయన కుటుంబానికి అడిగిన చోటల్లా నాడు కాంగ్రెస్ సీట్లు ఇచ్చింది. నేడు వైసిపి కూడా అదే పని చేస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో బొత్స సత్యనారాయణ రాజకీయాల్లో తాను తలచేది అమలు చేసేవారు. ఇప్పుడూ వైసిపిలో అదే చేస్తున్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో మిగతా 2లో..

నేడు జెడ్‌పి

స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను గురువారం నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండో స్థాయీ సంఘంతో సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 10.30 గంటలకు ఐదో స్థాయీ, మధ్యాహ్నం 12 గంటలకు 4, 6వ స్థాయీ, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లా అధికారులు అందరూ తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ప్రకటనలో స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం ఇస్తే సరిపోతుందా?

▶ వార్త 7లో..

ఎల్ఐసి ఉద్యోగుల వాకౌట్ సమ్మె

▶ వార్త 2లో..

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాల్సిందే..

▶ వార్త 6లో..



విన్యాసాల్లో పాల్గొననున్న నౌకలు

మిలాన్ విన్యాసాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ నేవీ మల్టీ నేషనల్ నావల్ ఎక్సర్‌సైజ్ మిలాన్ 2024ను విశాఖపట్నంలో ఫిబ్రవరి 19-27 మధ్య నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. గతంలో 11వ ఎడిషన్‌ను కూడా విశాఖలోనే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈస్టర్న్ నేవల్ కమాండ్ బాధ్యతాయుతమైన సముద్ర శక్తిగా మరింత ఎత్తుకు ఎదిగేందుకు, సముద్ర భద్రతను మరింత మెరుగుపరుచుకోవడానికి ఈ విన్యాసాలు తోడ్పడతాయని నేవీ అధికారులు భావిస్తున్నారు. ఇంటర్నేషనల్ మారిటైమ్ సెమినార్, ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్, మారిటైమ్ టెక్ ఎగ్జిబిషన్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్ఛేంజ్, మిలన్ ఆఫ్ యంగ్ ఆఫీసర్స్, క్రీడా ఈవెంట్స్ వంటి బహుముఖ కార్యక్రమాలు మిలాన్‌లో భాగంగా ఉంటాయని చెబుతున్నారు.

బస్సులు, రైళ్లు కిటకిట



ద్వారకా బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పండగకు సొంత ఊళ్లకు జనం పయనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతికి ఊరెళ్లాలి అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి బస్సులు, రైళ్లే. పండగ సంతోషాలలో వీటి పాత్ర కీలకమైనది. అందుకే ఈసారీ పెద్ద పండగకు ఇవి కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సమయంలో బస్ టికెట్ ఛార్జీలను పెంచడం మొన్నటి వరకూ ఆనవాయితీగా ఉండేది. కానీ ఈసారి ఆర్‌టిసి బస్సు ఛార్జీలను ప్రభుత్వం పెంచలేదు. అదే సందర్భంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్ టికెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంటే అటు, ఇటు రెండు వైపులా ఛార్జీలో 10 శాతం తగ్గిస్తూ రాయితీ ప్రకటించారు. దీంతో ప్రయాణికులు విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు అధికంగా తరలి వస్తున్నారు. ఈ నెల 9 నుంచి 18 వరకు స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ఇది వర్తిస్తుంది. దీంతో సంక్రాంతికి సొంతూర్లకు వెళ్లేవారు బస్సుల కోసం తరలిరావడంతో స్థానిక ద్వారకా మిగతా 2లో..



ప్రయాణికులతో కిక్కిరిసిన విశాఖ రైల్వే స్టేషన్

మొదటి పేజీ తరువాయి..

ఇళ్లకు షోకాజ్ నోటీసులు

స్పష్టం చేస్తున్నారు.

ఉపసంహరించుకోవాలి: నాగశేషు

అంగన్‌వాడీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకొని, సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.నాగశేషు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.

బస్సులు, రైళ్లు కిటకిట

ఆర్‌టిసి కాంప్లెక్స్ బుధవారం కిటకిటలాడుతూ కనిపించింది. ఇదే రద్దీ ఆదివారం వరకూ ఉంటుందని, వచ్చే బుధవారం నుంచి తిరుగు ప్రయాణికులతో బస్ స్టేషన్ రద్దీగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. గతంలో కంటే ఈసారి 250 బస్సులను అదనంగా నడుపుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు బస్సులను అధికంగా వేసినట్టు వెల్లడించారు. ఇదిలా ఉండగా విశాఖ రైల్వే స్టేషనూ బుధవారం జన రద్దీతో కనిపించింది. ఎక్కడ చూసినా లగేజీలతో ప్రయాణికులే కనిపించారు.

వైసిపి ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ ?

తన సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా గెలుపొందిన వైసిపి నాయకులు ఎంవివి.సత్యనారాయణ 2024 ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ నుంచి వెలగపూడి రామకృష్ణబాబుపై పోటీకి దిగుతున్న విషయం తెలిసిందే. వీరి మధ్య హోరాహోరీ రాజకీయ పోరు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ ఎంపీ టికెట్‌ను వైసిపి నుంచి ఆశిస్తున్న వారి సంఖ్య ప్రస్తుతం తక్కువే. ఈ క్రమంలో బొత్స ఝాన్సీలక్ష్మి గతంలో ఎంపీగానూ, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గానూ రాజకీయ, పరిపాలనా అనుభవం కలిగినవారు కావడంతో వైసిపి అధిష్టానం తక్కున ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. త్వరలో విశాఖ రాజకీయాల్లో బొత్స కుటుంబం రంగప్రవేశం చేయనున్నట్టు ఇప్పుడు చర్చ నడుస్తోంది. మరోపక్క బిజెపి నుంచి విశాఖ పార్లమెంట్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు కూడా తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వారు విశాఖపై దృష్టిపెట్టారు. టిడిపి నుంచి శ్రీభరత్ టికెట్ ఆశిస్తున్నా జనసేన-టిడిపి కాంబినేషన్‌లో పరిణామాలు ఎలా మారతాయో వేచి చూడాల్సిందే.

స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పగించొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పగించే చర్యను పోరాటాలతో అడ్డుకొని తీరుతామని విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 1014వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికవర్గం మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు బిపివి.శంకరన్, ఆర్.రమణబాబు, యు.పోతన్న, పి.ఎ.బాబు, సిహెచ్.సత్తిరాజులు, కెవి.రమణ, జి.ధనరాజు పాల్గొన్నారు.

కొర్ల కృష్ణను శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తక్కువ వడ్డీ అర్ధ రూపాయికే వినియోగదారులకు లక్షలాది రూపాయలు రుణాలు ఇస్తామని నమ్మించి పలువురిని మోసం చేసిన నకిలీ కెకెబికె కంపెనీ అధినేత కొర్ల కృష్ణను కఠినంగా శిక్షించాలని బాధితుల పక్షాన పోరాటం చేస్తున్న డాక్టర్ గొలగాని అశోక్ కుమార్ యాదవ్ కోరారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

రోడ్లపై భోగి మంటలు వేయొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భోగి మంటలను రోడ్లపై వేయొద్దని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ నగర ప్రజలకు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. భోగి మంటలలో వాడి పారేసిన పాత టైర్లను ఉపయోగించడం వల్ల కాలుష్యం పెరుగుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి-అరకులోయ: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల విధులు కీలకమని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో అరకు అసెంబ్లీ నియోజక వర్గం సెక్టార్ అధికారులతో ఎన్నికల విధులు, బాధ్యతలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారుల ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలను ముందుగా సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలపై నివేధించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో మాత్రమే పోలింగ్ ప్రక్రియ జరగాలని స్పష్టం చేసారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఎస్మాను రద్దు చేయకుంటే బంద్ చేపడతాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు తమ జీతాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, తదితర డిమాండ్లతో నెల రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి మొండిగా వ్యవహరించడం సరైంది కాదని విశాఖ అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మాను ఎత్తివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేపడతామని హెచ్చరించారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జనసేన ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్ లక్ష్మీ సౌదరి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుమాలినపనని అన్నారు. ఎస్మా చట్టం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప వీరికి వర్తించదన్నారు. తెలంగాణ ప్రభుత్వంకంటే అదనంగా వెయ్యి రూపాయలు పెంచి జీతం చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఒక్క రూపాయి కూడా పెంచలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు వై.కొండయ్య, ఎంసిపిఐ నాయకులు శంకరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులపైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, విశాఖపట్నం పోర్టు, డాక్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఎస్‌కె.రెహ్మాన్, హాస్పిటల్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, కెవిపిఎస్ నాయకులు వై.రాజు, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.తులసి, ఎల్.దేవి, పద్మావతి, పి.శ్యామలాదేవి పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

వేతన సవరణ కోసం..

ఎల్‌ఐసి ఉద్యోగుల వాకౌట్ సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్‌ఐసి ఉద్యోగులకు సంబంధించి వెంటనే వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎల్‌ఐసి డివిజనల్ ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం ఒక గంట వాకౌట్ సమ్మె నిర్వహించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, ఎల్‌ఐసి క్లాస్ 1 ఎంప్లాయీస్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియాతో కూడిన జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2022 ఆగస్టు నుంచి రావలసిన వేజ్ రివిజన్ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పిఎస్‌లో ఉన్న ఉద్యోగులకు యాజమాన్యం షేర్ 10 శాతం నుంచి 14 శాతం చేయాలని, కొత్తగా ఉద్యోగాల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు జి.వరప్రసాద్, వై.వెంకటరావు, కె.మోహనరావు, మూర్తి పాల్గొని మాట్లాడారు.



వాకౌట్ సమ్మెలో పాల్గొన్న ఎల్‌ఐసి మహిళా ఉద్యోగులు

'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు బుధవారం పలుచోట్ల ప్రారంభమయ్యాయి.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో "ఆడుదాం ఆంధ్రా" మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి క్రీడాకారుడూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలో మండల స్థాయి ఆటల పోటీలను ఎంపిపి కె.రాంబాబు ప్రారంభించారు. పద్మనాభం గోస్తని స్కూల్, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, పద్మనాభం కెజిబివి పాఠశాల కృష్ణాపురంలోని స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆట స్థలంలో రకరకాల ఆటలు పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలో పద్మనాభం జట్టు ప్రథమ స్థానంలో, నేరేళ్లవలస రెండో స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ప్రభాకరరావు, వైసిపి నాయకులు కె.లక్ష్మణరావు. టి.పద్మనాభస్వామి, బి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. సబ్బవరం సచివాలయం పరిధిలో ప్రతిభ విద్యాలయం, మదర్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపిపి బోకం సూర్యకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసిల్దార్ బి.సత్యనారాయణ, వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద్, వైసిపి నేతలు బోకం రామునాయుడు, కర్రి బాబు, సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, సబ్బవరం-2 ఎంపిటిసి బైలపూడి దేముడుబాబు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీలను అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి నాగ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని జెడ్‌పిటిసి సభ్యుడు లాలం రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆడదాం ఆంధ్ర పోటీలను ఎంపిపి కోన సంధ్య బుజ్జి, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, నర్మాల కుమార్ ప్రారంభించారు. కబడీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, వైఎస్ఆర్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక జిల్లా పరిషత్తు హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలను బుధవారం హౌసింగ్ పీడీ రమామణి, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చింతాడ దేవి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపిటిసీలు సూరిశెట్టి రాము, బి గణేష్, కోనపల్లి రామ్మోహన్‌రావు, ఎంఈఓలు వేణుగోపాల రావు, శివ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

3 వేల లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలో సారా తయారీ కేంద్రాలపై నర్సీపట్నం రూరల్ ఎస్సై ధనుంజయనాయుడు బుధవారం దాడులు నిర్వహించారు. మండలంలోని గురందొరపాలెం గ్రామ శివారులో దాడులు నిర్వహించి 3వేల లీటర్ల బెల్లం పులుపు, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

కోడి పందాలు ఆడితే చర్యలు

ప్రజాశక్తి -పద్మనాభం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడిపందాలు, పేకాట ఆడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని పద్మనాభం సిఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. కోడి పందాలకు ఎటువంటి అనుమతులు లేవని, ప్రజలు గమనించి జూదాలకు దూరంగా ఉండాలని కోరారు.

రోలర్ స్కేటింగ్ సాహితికి ప్రోత్సాహకం

ప్రజాశక్తి -తగరపువలస : రోలర్ స్కేటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో అనేక పతకాలు సాధించిన విశాఖ నగర పరిధి ఎండాడకు చెందిన సాహితికి చిప్పాడ దివీస్ సంస్థ ప్రోత్సాహకంగా రూ.3.85 లక్షల చెక్కును అందించింది. స్థానిక దివీస్ సంస్థ కార్యాలయంలో సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.దేవేందర్ బుధవారం చెక్కు అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే ఎన్నో పతకాలు సాధించిన సాహితి ఇక ముందు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ.ఆనంద్, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, పైడినాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్‌స్కూల్‌కు చెందిన 8, 10 తరగతుల విద్యార్థినులు జి.నిఖిత, ఎస్.హారిక జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్కూల్‌లో బుధవారం వారిద్దరినీ అభినందించారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌లో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న పిఇటి పి.అరుణ్‌కుమార్‌ను కూడా అభినందించారు.

యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాములప్పడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జివిఎంసి నాలుగో వార్డు, చేపలుప్పాడ గ్రామానికి చెందిన బాడితబోయిన రాములప్పడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం భీమిలిలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కమిటీ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

11వ వార్డులో బాబు ష్యూరిటీ...

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డులో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పరిధి డ్రైవర్సకాలనీ, ముస్తాఫా కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాలేషా, రేజేశ్వరి, ఇజాజు, హిమేతుల్ల, నింగుబోతు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో 'జెమ్- 24'

ప్రజాశక్తి-విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజనోత్సవం గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వాణిజ్యరంగంలో వస్తున్న మార్పులు, ఫిన్ టెక్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం, బిజినెస్ అనలిటిక్స్ విద్యార్థులకు అపార అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. కాలానుగుణ మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు.

సైనికుల్లా పనిచేస్తాం

ప్రజాశక్తి -మధురవాడ : పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేస్తామని జివిఎంసి 7వ వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు తెలిపారు. స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం వార్డు నాయకులు, కార్యకర్తలతో భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. కొత్తగా వార్డు అధ్యక్షునిగా నియమితులైన నరసింహనాయుడును పరిచయడం చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, పిళ్లా శ్రీను, పేకెటి శ్రీను, త్రినాథ్, చిన్న, శివ, నాని శంకర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ రాష్ట్ర అధ్యక్షులుగా రాము



ప్రజాశక్తి -ఆనందపురం : ఆంధ్ర రాష్ట్ర గీత కార్మిక సేవా సంఘం (యాత సంక్షేమ సేవా సంఘం) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఆనందపురంలో ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా చోడి ఆదినారాయణ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అంగటి రాము, గొర్ల సూరిబాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షులు, లీగల్ అడ్వైజర్‌గా అండిబోయిన లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వనము శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చిట్టిబోయిన రాము, అండిబోయిన అప్పారావు, అంగటి నానాజీ, కార్యదర్శులుగా బాడితబోయిన రాములప్పుడు చెల్లుబోయిన దుర్గారావు, పట్నాల వెంకటేష్, ఉప కార్యదర్శులుగా బుత్తల రాజు, అంగటి మూర్తి సహ కార్యదర్శులుగా కట్ట మాణిక్యం, వడిశల శ్రీను, కమిటీ సభ్యులుగా కొప్పా రామలక్ష్మి జిత్తుగా ఎర్రినాయుడు, దీసు రమణ ఎనికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము మాట్లాడుతూ, వరుసగా రెండవసారి అధ్యక్ష పదవి అప్పగించడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల యాత సంఘ నాయకులు పాల్గొన్నారు

పక్కాగా నిఘా : సిఐ సురేష్

ప్రజాశక్తి-మధురవాడ : సంక్రాంతికి ఎక్కువ మంది నగరం విడిచి సొంతూళ్లకు వెళ్తున్న నేపథ్యంలో నార్త్ జోన్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిఘా పెడుతున్నట్లు నేర విభాగం సిఐ సురేష్ తెలిపారు. చిల్లర దొంగతనాలు సైతం జరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాల నివారణలో భాగంగా కాలనీల్లో ఫ్లెక్సీలు, ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్ల భద్రత విషయం మరచిపోవద్దని సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన ఆభరణాలు, వస్తువులను బ్యాంక్ లాకర్లలో లేదా నమ్మకమైన వ్యక్తుల వద్ద ఉంచుకోవాలని సూచించారు. అపార్టుమెంట్లు, విద్యాసంస్థలు, బ్యాంకుల వద్ద పగలూ, రాత్రి కాపలా ఉండేలా భద్రతా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. నివాసాల్లో పనికి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను చేర్చుకొనే విషయంలోనూ, ఇళ్లను అద్దెకిచ్చేటప్పుడు, వాచ్‌మ్యాన్లను నియమించేటప్పుడు వారి పూర్తి చిరునామా, ధ్రువపత్రాలను సేకరించాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఊరెళ్లే సమయంలో పక్క నివాసితులతో పాటు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 0891 272333, సిఐ (8331041672), ఎస్ఐ 9440904314 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ఎల్ఆర్‌హెచ్ఎంఎస్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని స్టేషన్‌కు సమాచారం అందిస్తే అక్కడ ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని సిఐ సురేష్ తెలిపారు.

వాలంటీర్లు, ఆర్‌పిలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : సంక్రాంతి కానుకగా గ్రామ వాలంటీర్లకు, వైఎస్ఆర్ క్రాంతి పథం ఆర్‌పిలకు వస్త్రాలను స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులే ఓ సైన్యం అన్నారు. కోవిడ్ కాలంలో ప్రజలకు సహాయం చేయడంలో వాలంటీర్లు ముందున్నారని పేర్కొన్నారు.

ప్రత్యర్థి ఎవరైనా భీమిలి వైసిపిదే

రాజకీయ ప్రత్యర్థి ఎవరున్నా, ఏ స్థాయి నాయకుడు బరిలో ఉన్నా సరే భీమిలిలో వైసిపిదే విజయమని ముత్తంశెట్టి జోస్యం చెప్పారు. వచ్చే మూడు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు అయినా, ఏకంగా టిడిపి అధినేత చంద్రబాబు వచ్చి ఇక్కడ పోటీ చేసినా వైసిపి అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని ఘంటా పదంగా తేల్చి చెప్పారు. ఐదేళ్లు ప్రజలను అంటిపెట్టుకుని, ప్రజల మధ్యన ఉన్న వారినే ఎమ్మెల్యేగా గెలిపిస్తారని, ఎన్నికలప్పుడు మాత్రమే కనబడితే ప్రజలు ఓట్లేయరని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు, జడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, అధికార పార్టీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపగుంట : వేపగుంటలోని 484 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా అసిస్టెంట్ డిఎం అండ్ హెచ్ఒ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ, శిబిరానికి వచ్చి తనిఖీలు నిర్వహించుకున్న వారికి అవసరమైన మందులు ఇస్తున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే కార్పొరేట్ ఆసుపత్రుల్లో జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తామన్నారు. జోన్-8 కమిషనర్ మాట్లాడుతూ, ఈ ఆరోగ్య సురక్ష శిబిరానికి 437 మంది హాజరయ్యారని, వారికి వైద్య తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశామని తెలిపారు.


జెవివి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జెవివి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గాజువాక : జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యాన రూపొందించిన వార్షిక కేలండర్‌ను బుధవారం గాజువాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా శాస్త్ర ప్రచారంలో భాగంగా విద్యావేత్తలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దేశ, ప్రపంచ శాస్త్రవేత్తల ఆవిష్కరణలను గుర్తుచేస్తూ ఈ కేలండర్‌ను జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ రూపొందించడం ముదావహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.గోపాలరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వికె.వరపురాం, కె.శేషగిరిరావు, ఉపాధ్యక్షులు వైఆర్‌కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, జిల్లా నాయకులు ఎల్.కృష్ణారావు, రత్నారావు, అప్పలరెడ్డి, సత్యనారాయణ, కెవి.ప్రసాద్, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

వికె పిసిపిఐఆర్ యుడిఎ చైర్మన్‌గా చొక్కాకుల



ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నం -కాకినాడ పెట్రోలియం కెమికల్, పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా వైసిపి సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వైసిపిఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఒత్తిడి నివారణకు విహార యాత్రలు

ప్రజాశక్తి - ములగాడ : ఒత్తిడి నివారణకు, క్షేత్రస్థాయి పరిజ్ఞానానికి విహారయాత్రలు ఎంతో అవసరం అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సిఇసి, ఎంఇసి చదువుతున్న విద్యార్థినులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ, ఆత్మీయ బంధాలకు, మానసిక ఉల్లాసానికి విహార యాత్రలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యలో భాగంగా ఇటువంటి యాత్రలను ప్రతి కళాశాల ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు బిపి.రాజు, అబీదా బేగం, వై.అనసూయాదేవి నాయకత్వంలో విద్యార్థినులు మధురవాడలోని శిల్పారామం, కైలాసగిరి, భీమునిపట్నం, వుడా పార్కు, విశాఖ మ్యూజియంలను సందర్శించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థినులు ప్రసంగించారు. అనంతరం అధ్యాపకులను, విద్యార్థినులను జ్ఞాపికలతో సత్కరించారు.

మహిళలకు ఉచిత కేన్సర్ టెస్టులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు ఎంటిసి కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ధాన్ ఫౌండేషన్ సహకారంతో మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో మహిళలకు కేన్సర్ టెస్టులను ఉచితంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన ధాన్ ఫౌండేషన్, మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధాన్ ఫౌండేషన్ హెల్త్ కో-ఆర్డినేటర్ కె.మురళీకృష్ణ, డాక్టర్ హరికృష్ణ కె.వసంత, కృష్ణ మాధవి గోపి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేయించుకుంటున్న బాణాల శ్రీనివాసరావు

కొనసాగుతున్న మున్సిపల్ సమ్మె

మధురవాడలో 40 మంది అరెస్టు

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్లు నెరవేర్చాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం పలుచోట్ల పోటీ కార్మికులను, వాహనాలను అడ్డుకున్నారు.

మధురవాడ : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజూ కొనసాగింది. జివిఎంసి 5, 6, 7, 8 వార్డులలో పోటీ కార్మికులను, చెత్త సేకరణ వాహనాలను బుధవారం పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. 6, 7, 8 వార్డులలో సుమారు 40 మంది కార్మికులను బుధవారం పి.ఎం.పాలెం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కష్టజీవులకు వేతనాలు పెంచక పోగా, తిరిగి వారిపై వైసిపి ప్రభుత్వం అబండాలు వేస్తోందని విమర్శించారు. ప్రతిరోజూ అరెస్టులు చేసి, నిర్బంధంతో అణిచివేయాలని చూస్తోందన్నారు. కార్మికులు ఇటువంటి బెదిరింపులకు, దాడులకు భయపడేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, ఎస్.రామప్పుడు, ఎన్.నరసేయమ్మ, ఉప్పాడ లక్ష్మి, నక్క అప్పారావు, సిహెచ్ అచ్చియ్యమ్మ, టి.జాన్, బి.నరసింగరావు, వి.చిన్నమ్మలు, గోవిందా, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : 6వ వార్డు పరిధి పిఎం.పాలెంలో పారిశుధ్య కార్మికులు వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షులు కెవిఆర్ కేటరింగ్స్ అధినేత గరే గురునాథ్, వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, జనసేన వార్డు అధ్యక్షులు సంతోష్‌నాయుడు, కనకరాజు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో భిక్షాటన


టౌన్ కొత్త రోడ్డులోని సూయజ్ ఫారం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

గాజువాక : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు గాజువాకలో బుధవారం భిక్షాటన చేపట్టారు. గాజువాక జోనల్ కార్యాలయం నుంచి కణితిరోడ్డు, చినగంట్యాడ, ఎస్‌సి.కాలనీ, ఆర్‌కె హాస్పిటల్ మీదుగా గాజువాక సిఐటియు ఆఫీసుకు భిక్షాటన ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా ప్రదర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, కె.కిరీటం, రాము, నక్క నాగరాజు, గణేష్, చిన్నారావు, హేమకుమార్, సుగుణాకర్‌రాజు, సత్యవతి అరుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి కార్మికులు కోరమండల్ గేట్ నుంచి శ్రీహరిపురం వరకు భిక్షాటన చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, పండగ పూట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వస్తులుండకుండా డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కె.పెంటారావు, పి.పైడిరాజు, కె.రమణ, సూరిబాబు, ఆదినారాయణ, అప్పారావు, రాంబాబు, రాము, రైలు బాబు, గొల్ల బాబు, తిరుపతిరావు, మురళీకృష్ణారావు, దుర్గారావు, బంగార్రాజు, కుమార్, ఎన్.ఉమాదేవి, దుర్గ, పాప, లలిత, లక్ష్మి, సూరమ్మ, రాజేశ్వరి, అప్పలకొండ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టౌన్ కొత్తరోడ్డులోని సూయజ్ ఫారం వద్ద సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు నిరసన కొనసాగించారు. మున్సిపల్ కార్మికులకు మద్దతుగా వాటర్ ఫిల్టరేషన్ వర్కర్లు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు పదో రోజుకు చేరాయి. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, కార్యదర్శి డి.శేఖర్, ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన ఎస్.శంకర్ రెడ్డి, పి.సతీష్, ఆర్.సత్యం పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు : వెంకటరెడ్డి

మున్సిపల్ వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారానికి 15 రోజులకు చేరిందని, రాష్ట్రవ్యాప్తంగా 46 వేల మంది పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా, యుజిడి కార్మికులు సమ్మె చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం సరికాదని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాలు పెంపుదల చేయకపోతే భవిష్యత్తులో సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



శ్రీహరిపురంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్మికులు జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు. ఇందులో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించిన మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే వారి సమస్యలను పరిష్కరించి పండగ నాటికైనా వారి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.సత్యనారాయణ, బొమ్మలు రాము, నిమ్మకాయల అజయ్ కుమార్, సూకరాజు, శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు, తదితరుల పాల్గొన్నారు.

సమ్మెను విరమించం

నర్సీపట్నం టౌన్: పట్టణంలోని అబీద్ సెంటర్‌లో ఎన్టీఆర్ స్టేడియం వద్ద మున్సిపల్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవిబాబు తన సిబ్బందితో కలిసి సమ్మె చేస్తున్న కార్మికులతో బుధవారం మాట్లాడారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యలు నెరవేర్చడానికి సిద్ధంగా ఉందని, పరిస్థితిని అర్థం చేసుకొని సమ్మె విరమించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం పూర్తిస్థాయిలో హామీ ఇస్తేకానీ సమ్మె విరమించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, మున్సిపల్ కార్మికుల నాయకుడు బొర్ర శీను, దేవుడు, బాబూరావు, పద్మ, మంగ పాల్గొన్నారు.

ముగిసిన ఇసిసి మ్యాడ్ ఫెస్ట్

ప్రజాశక్తి-పేపగుంట : విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం టెక్నెస్ట్ మెమరబుల్ అండ్ డాజిలింగ్ (ఎంఎడి) అట్టహాసంగా జరిగింది. టెక్నెస్ట్‌లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన పిపిటి ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, సర్క్యూట్ డిజైన్ సెమినార్స్ ఫొటోగ్రఫీ, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్, ఇసిఇ విభాగాధిపతి బి.జీవన్‌రావు, ద్వారా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న జియ్యాని శ్రీధర్

పెన్షన్ పంపిణీ

ప్రజాశక్తి-పేపగుంట : జివిఎంసి 52వ వార్డుకు సంబంధించిన నాలుగు వార్డు సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 14 పెన్షన్లను శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు, ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.3 వేలకు పెంచారని తెలిపారు. ఇటీవల తాత్కాలికంగా రద్దు చేసిన పెన్షన్లను పరిశీలించి తిరిగి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెదుళ్ల శ్రీను, వార్డు సచివాలయ సెక్రటరీ నాగేశ్వరరావు, నీలవేణి, శ్రీనివాసరావు, సిఎ సుధారాణి, వార్డు వాలంటీర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులపై వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన పార్టీ కార్పొరేటర్లతో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల గురించి కార్పొరేటర్లతో చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలి, కెవిఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇంచార్జ్ నీలి రవి తదితరులు పాల్గొన్నారు.


ఉత్తర నియోజకవర్గ పనులపై సమీక్షిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజుకి చేరుకున్నది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగి వాసుదేవరావు మృతి చెందిన నేపథ్యంలో బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులలకు శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆడారి కిషోర్ కుమార్ వాసుదేవరావు అకాల మృతి పట్ల సంతాపాన్ని తెలియజేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగేషు, ఐద్వా నాయకురాలు డి.వరలక్ష్మి సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు టి కృష్ణ, అచ్యుత కృష్ణ, వెంకటరావు, నూకేష్, నాగేశ్వరరావు, నాయుడు, సతీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 22వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులనూ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన టెర్మినేషన్ ఉత్తర్వులను, షోకాజ్ నోటీసులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జి.లక్ష్మి, ఐ.శ్రీరామమూర్తి, వినోద్, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.



విశాఖలో రిలే నిరహార దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

బ్యాడ్మింటన్ స్టార్ ఆఫ్ ఇండియాగా కావ్యశ్రీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన ఆర్.కావ్యశ్రీ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన స్టార్ ఆఫ్ ఇండియా బహుమతి దక్కించుకుంది. మహారాష్ట్రలో గచ్చిరోలులో ఈ నెల 5 నుండి 10వ తేదీ వరకు 69వ సీనియర్ స్త్రీ, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున కావ్యశ్రీ పాల్గొని మంచి క్రీడా ప్రతిభ చూపించడంతో ఆమెకు నిర్వాహకులు స్టార్ ఆఫ్ ఇండియాగా బహుమతిని ప్రదానం చేశారు. అవార్డ్ అందుకున్న కావ్యశ్రీకి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆర్.వెంకట్రావు, అధ్యక్షులు ఆర్ ప్రభుజీ, ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, పెదపూడి శంకర్రావు అభినందనలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో డివిఎన్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల (డీవీఎన్)లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సిరవెల్ల బాలసాయి చరణ్ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలలో తన ప్రతిభ చాటాడు. ఈ నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఇంటర్ కోలీగ్ విభాగంలో నిర్వహించిన 75 కేజీల విభాగం బాడీ బిల్డింగ్ పోటీలలో గోల్డ్ మెడల్, 83 కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకం బాలసాయి చరణ్ సాధించారు. ఈ సందర్భంగా బాలసాయి చరణ్‌ను దాడి విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్, డీవీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.దయామాధురి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పూర్తి పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులు చేస్తూ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అధికారులు సిబ్బంది శిక్షణ, పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడం, టీవీలో పత్రికలలో వచ్చిన వార్తలపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. తప్పులు చేసిన బూత్ స్థాయి అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల విధులలో ఉన్న అధికారులు సిబ్బంది రాజకీయ పార్టీల నమ్మకం కలిగి ఉండాలన్నారు. పార్టీల ప్రతినిధుల కోరిక మేరకు రెవెన్యూ అధికారులే కాకుండా జీవీఎంసీ, ఎక్సైజ్ అధికారులు సమావేశానికి హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు (టిడిపి), పి.రామకృష్ణ (వైసిపి), కె.హరినాథ్ బాబు (ఆప్ ఆద్మీ), ఎస్.వి.వి. రామచంద్రరావు (బీఎస్పీ) ఎన్నికల విభాగం డిటి రవికుమార్, ఎస్ఎ తులసీరామ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న విష్ణుమూర్తి, సుందరయ్య తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

డావిన్సీ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకల్లో డాక్టర్ విష్ణుమూర్తి

ప్రజాశక్తి అచ్యుతాపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి అన్నారు. తిమ్మరాజుపేట డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో స్పోర్ట్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్ణుమూర్తి మాట్లాడుతూ డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యతో పాటు క్రీడలు సాంస్కృతి కార్యక్రమాల్లో శిక్షణ అవ్వడం అభినందనీయమన్నారు. క్రీడా పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. స్కూల్ వ్యవస్థాపకులు కర్రి సుందరయ్య, డైరెక్టర్ జె రమణాజీ జ్యోతి ప్రజ్వలన చేశారు. స్విమ్మింగ్, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ విష్ణుమూర్తితో పాటు అచ్యుతాపురం, మునగపాక మండలాల ఎంపిపిలు కోన సంధ్య, మల్ల జయలక్ష్మి, సుందరయ్య, రమణాజీ, ప్రభాకర్ మీనా మిశ్రా, డీన్ సూరిబాబు తదితరుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మెగా డిఎస్‌సి విడుదల చేయాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : మెగా డీఎస్సీ తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ నెహ్రూ చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్మోహన్ రెడ్డికి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నీలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి రాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రేఖ సంతోష్, బర్నికాన సాయి, బోరా రాజేష్, ఉమ్మి సతీష్ , శ్యామ్, శ్రీను రమేష్, శ్రీకాంత్, పరమేష్, లక్ష్మి శాంతి, కుమారి, పద్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌కు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సావిత్రి భాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్థానిక సబ్ జైలుకు అవసరమైన రూ.12 వేలు విలువ గల 50 స్టీల్ ప్లేట్లు, 50 స్టీల్ గ్లాసులను అనకాపల్లి జిల్లా ఖజానా శాఖ అధికారి వి.లక్ష్మి సుభాషిణి చేతుల మీదుగా జైల్ సూపరింటెండెంట్ వైఎన్ గణేష్‌కు బుధవారం అందజేశారు. ముందుగా జైల్ ఆవరణ లో మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ లర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత జైల్ హెడ్ వార్డర్, బల్లా నాగభూషణం, సావిత్రి భాయి పూలే ట్రస్ట్ చైర్మన్ గూడూరి సీతామహాలక్ష్మి, గ్రీన్ క్లబ్ అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం దంపతులు భోగి మంటలతో సంక్రాంతి సంబరాలను ఆరంభించారు. విద్యార్థులు సంప్రదాయం వస్త్రధారణలతో భోగిమంటల చుట్టూ జానపద నృత్యాలు చేశారు. పల్లెను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన పూరిళ్లు, కోడిపుంజులు, ఎడ్లబండి, హరిదాసు సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూరింటిలో సాంప్రదాయ బద్ధంగా పాలును పొంగించారు. పరమన్నం వండి ప్రసాదంగా పంపిణీ చేశారు. ఉత్సాహంగా ఉల్లాసంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. రంగవల్లులు, రుచికరమైన సాంప్రదాయం వంటకాలు పోటీల్లో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు. విజేతలకు విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం దంపతులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమతి, పద్మిని, సమీరా, రమణ, కళ్యాణి, రమణ, ప్రసాద్, డేవిడ్, చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ వేగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సంక్రాంతి సంబరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పచ్చని పల్లెటూర్ల వాతావరణం తలపించే దృశ్యాలు కనువిందు చేశాయి. మట్టితో నిర్మించిన పూరి గుడిసెలు, దాని ముందు రంగు రంగుల ముగ్గులు, బసవన్నలు, కొమ్మ దాసరి, హరిదాసుల వేషధారణతో విద్యార్థులు సంకీర్తనలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. పిండి వంటలు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినుల జానపద నృత్యాలు సంక్రాంతి శోభను ఉట్టిపడేలా చేశాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మాడెం జోగారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాజువాక గిరీష్ విద్యానికేతన్‌లో భోగిమంటలు

సీతమ్మధార : గురుద్వార సమీపంలోని శ్రీనవోదయ జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బిశెట్టి రాము మాట్లాడుతూ, సంక్రాంతి తెలుగు ప్రజలందరికీ ఒక పెద్ద పండుగ అన్నారు. అందరూ ఆనందంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాజువాక : గిరీష్ విద్యానికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసరావు, స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలంలో ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా పొగ మంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం తెల్లవారుజామున తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్‌లో కురిసిన మంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. ఉదయం 9 గంటల వరకు మంచు ప్రభావం తగ్గలేదు. మంచు కారణంగా చలి అధికంగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



దట్టంగా కురుస్తున్న మంచు

దేవరాపల్లిలో ఉద్రిక్తత

- వాటర్ ట్యాంకు ఎక్కిన పెద గంగవరం రైతులు
- పెట్రోల్ క్యాన్లతో రామాలయంలో తమను తాము నిర్బంధించుకున్న మరికొంత మంది
- సమస్యను పరిష్కరించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపు
- పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, జీనబాడు పంచాయతీ పరిధి పెదగంగవరం గ్రామ రైతులు ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. దీంతో దేవరాపల్లి మండల కేంద్రంలో బుధవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గిరిజన సంక్షేమశాఖ అధికారుల వేధింపులు ఆపాలని, తమ హక్కులు కాపాడాలని కోరుతూ 300 మంది రైతులు ఈ నెల 6వ తేదీ నుండి తమ గ్రామంలో నిరసన తెలుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం 10 మంది రైతులు దేవరాపల్లిలో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసనకు దిగారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరించారు. మరి కొంతమంది రైతులు పెట్రోల్ క్యాన్‌తో గ్రామ రామాలయంలోకి వెళ్లి తాళం వేసి తమను తాము నిర్బంధించుకున్నారు. దీంతో రైతుల ఆందోళన ఉద్రిక్తతంగా మారింది. ఈ నేపథ్యంలో దేవరాపల్లి తహశీల్దార్ ఎం.లక్ష్మి, సీఐ కుమారస్వామి, ఎస్ఐ డి.నాగేంద్ర సంఘటనా స్థలానికి వచ్చి కిందకి దిగి సమస్యలు చెప్పుకోవాలని రైతులకు సూచించారు. ఏళ్ల తరబడి తమ సమస్యలు అధికారులకు చెప్పుకున్నా పరిష్కారం కాలేదని, ఉన్నతాధికారులు వచ్చి తమ సమస్యలు పరిష్కరించేంతవరకు వాటర్ ట్యాంక్ దిగ రామని రైతులు తెగేసి చెప్పారు. చివరకు రెవిన్యూ, పోలీస్ అధికారులు



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న రైతులు

చేసేదేమీ లేక ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల సూచన మేరకు పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మతో రెవిన్యూ, పోలీస్ అధికారులు పెదగంగవరం వెళ్లిన రైతులతో చర్చలు జరిపారు. ఆందోళన కారుల సమస్యను పరిశీలించి న్యాయం చేస్తానని పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ హామీ ఇవ్వడంతో పెదగంగవరం రైతులు నిరసన దీక్షలను ఎట్టకేలకు విరమించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కోటన వెంకటరమణ, కోటాన అక్కు నాయుడు, తోటదేముడు, కొట్టాన రాము, మిడతాడ శ్రీను, అప్పలనాయుడు, సోమినాయుడు, గవిరెడ్డి దేవుళ్ళు, గుల్లిపల్లి అర్జున తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక బీసీ కాలనీకి చెందిన వైద్యర్ల సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులకు వైయస్సార్ బీమా పథకంలో భాగంగా దహన ఖర్చులు నిమిత్తం తక్షణం ఇచ్చే రూ.10వేలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బి గణేష్, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్రావు, పిల్లి అప్పారావు, ఆడారి కాశిబాబు భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలో రెండవ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. 970 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అ సందర్భంగా నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పెంచిన 3000 పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలోఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు పాల్గొన్నారు.

జనసేన భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-సబ్బవరం : జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పినగాడి జంక్షన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ మొగలిపురం, మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, అయ్యన్నపాలెం, వంగలి, అంతకాపల్లి, రావులమ్మపాలెం, సబ్బవరం గ్రామల మీదుగా అమృతపురం వరకు సాగింది. పార్టీ మహిళా కార్యకర్తలు పంచకర్ల రమేష్ బాబుకు తిలకం దిద్ది, హారతులు పట్టి స్వాగతించారు. సబ్బవరం మండలంలోని జనసేన పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలను చైతన్యవంతం చేయడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు పంచకర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, జిల్లా సెక్రటరీ ఇందుల వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ గండి దుర్గాప్రసాద్, కంచిపాటి రాంబాబు, బలిరెడ్డి రామకృష్ణ, కర్రి కనకరాజు, బొడ్డపల్లి సూరిబాబు, పాల్గొన్నారు.

నాగరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి భర్త నాగరాజ అంతిమయాత్ర బుధవారం జరిగింది. సమీప గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగరాజు మృతదేహానికి నివాళులర్పించి ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలో గల పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దైట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రాజెక్ట్ ఎక్స్పో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'వేస్ట్ టు పవర్ జనరేషన్', కిక్కిక్కితే స్టార్ట్ అవ్వని వెహికల్, సోలార్ ట్రాకింగ్ సిస్టమ్, సెన్సార్ స్టిక్, ఫ్లాట్ ఫామ్ దగ్గరకు రాగానే దాటని బస్ వంటి సమాజానికి ఉపయోగపడే అధునాతన సాంకేతికతో కూడిన మోడల్ ప్రాజెక్ట్ తయారు చేశారు. ఈ ఎక్స్పోలో డి.లక్ష్మీలావణ్య, బి.హెమశ్రీ రూపొందించిన 'వేస్ట్ టు పవర్ జనరేషన్' అనే ప్రాజెక్టకి ప్రథమ బహుమతి, బి.హిరన్మై, ఎన్.వర్షిణి రూపొందించిన 'కిక్కిక్కితే స్టార్ట్ అవ్వని వెహికల్' ప్రాజెక్టకి ద్వితీయ బహుమతి దక్కాయి. వీరికి ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి, ప్రోజెక్ట్ ఇంజనీర్ బి.శేషగిరి రావు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కృషి

ప్రజాశక్తి- అనకాపల్లి : వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు యువత కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డిఏ) పథక సంచాలకులు (పీడీ) కాండ్రేగుల శచీదేవి పిలుపునిచ్చారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మై భారత్-వికసిత్ భారత్ ఎ2047పై డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని వి.లాస్యప్రియ, ద్వితీయ, తృతీయ బహుమతులను పి.దివ్యశ్రీ, ఐ.వి.శ్రీవైష్ణవి పొందారు. విజేతలకు శచీదేవి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాండ్రేగుల వెంకటరమణ, మళ్ల బాపునాయుడు, మారిశెట్టి శివరామకృష్ణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం, కొండకర్ల గ్రామాలలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల పరిషత్ అధ్యక్షురాలు కోన సంధ్య బుజ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సాధారణ రకం ధాన్యం బస్తాకు క్వింటకు రూ.2183 చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు కుమార్, మండల వ్యవసాయ అధికారి శంకర్ గోవిందా, కాండ్రేగుల బాల సూర్యనారాయణ, ఉపసర్పంచ్ ఎం.వెంకట సీతారాము తదితరులు పాల్గొన్నారు.

టిఎన్‌టియుసి యాత్రకు టిడిపి నేతల స్వాగతం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రకు అచ్యుతాపురంలో బుధవారం ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ యాత్ర టెక్కలి నుంచి కుప్పం వరకు సాగుతుందని వెళ్తుందని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు తెలిపారు. అహంకారి పోవాలి ఆత్మగౌరవం రావాలి అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పి కొండబాబు, నాయకులు మెరుగు బాపు నాయుడు, టిడిపి నాయకులు డ్రీమ్స్ నాయుడు బాబు, కూనిశెట్టి రమణ పాల్గొన్నారు.

గ్రామాల్లో భరత్ కుమార్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ మంగళవారం రాత్రి మండలంలోని కొత్తపల్లి, బుచ్చయ్యపేట, తేగాడ, పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కరణం శ్యామ్‌సన్, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, అద్దెపల్లి శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతివనం కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : విజయవాడలో ఈ నెల 19న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల మహాశిల్పం, స్మృతివనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని దేవరాపల్లిలో బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ముందుగా బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు వరదపు రెడ్డి సింహాచలం నాయుడు, వరదపురెడ్డి లలితా నాయుడు, రొంగలి నారాయణమ్మ, గొర్లెపోటు రమాదేవి, కాటపల్లి అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

ప్రజాశక్తి-కశింకోట : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మండలంలో కన్నూరుపాలెంలో వైసిపి నాయకులు బుధవారం పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళీ, కూండ్రపు రామునాయుడు, కూండ్రపు అక్కునాయుడు, వర్రి పోతురాజు, చిరికి సన్యాసి నాయుడు, కన్నూరు ఎర్రినాయుడు, దుర్గా ప్రసాద్, కన్నబాబు, ద్వారపురెడ్డి సత్తిబాబు, కచ్చల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : శ్రీవిష్ణు హాస్పటల్, శిశుపెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ అడిగర్ల సుధీర్, డాక్టర్ సందీప్, డాక్టర్ సత్య, డాక్టర్ దీప్యా తదితరులు జనరల్, డెంటల్, హెయిర్, స్కిన్, ఫెర్టిలిటీ సమస్యలు ఉన్న 89 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు బాబు, చౌడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, శ్రీవిష్ణు హాస్పటల్, సుశీల్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి రూ.20 వేలు విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలకు కంప్యూటర్ కొనుగోలు చేసేందుకు పూర్వ విద్యార్థి కెవివి నూకరాజు (నానాజీ) రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై జగదీశ్వరరావు ద్వారా ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబుకి బుధవారం నూకరాజు అందించారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ కేవీఎస్ నాయుడు, నిరంజన్ కుమార్, బీఎం నాయుడు, విశ్రాంత ఇంజనీరింగ్ అధికారి ఎం చిన్నారావు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాల్సిందే..

కలెక్టరేట్ల వద్ద న్యాయవాదుల నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం జిల్లా కోర్టు అవుట్ గేట్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆస్తులు, హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే హరించేలా వ్యవహరించడం దారుణమన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ చేతుల్లో నుంచి ప్రజల భూమి, హక్కులను ప్రభుత్వం లాక్కొని కనీస న్యాయ పరిజ్ఞానం లేని ఉద్యోగుల చేతుల్లో పెడుతోందని విమర్శించారు. సామాన్యులు ఎంతవరకు ప్రభుత్వ అధికారులతో పోరాడి హైకోర్టు తలుపులు తట్టగలరని ప్రశ్నించారు. ఆలోపు కబ్జాదారులు, కార్పొరేట్లు, దోపిడీదారుల చేతుల్లోకి అధికారులు, రాజకీయ ప్రతినిధుల ప్రాపకంతో భూములు చేతులు మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి : నూతన భూమి యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నెహ్రూ చౌక్ మెయిన్ రోడ్డు మీదగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి లక్ష్మణ్, సురా శ్రీనివాస్ మాట్లాడుతూ గత 19 రోజులుగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ



విశాఖ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న న్యాయవాదులు

నూతన భూమిహక్కు చట్టం - రైతులకు, భూమి, భవనాలు, స్థలాలు, ఇతర స్థిరాస్తుల యజమానులకు అశనిపాతమని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిలక్ష్మణ్, బంధం రమణ, కుసుమ, న్యాయవాదులు మోహనరావు, సుధాకర్, ఎం ఎ మాధవరావు, మళ్ల వెంకటరెడ్డి నాయుడు, ఐతా సన్యాసి రావు, కనిశెట్టి సురేష్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇస్తే సరిపోతుందా?

-మిగిలిన సరుకుల మాటేంటి ? - మండల సమావేశాల్లో పలువురు నిలదీత



కోటవురట్ల మండల సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -కోటవురట్ల:కరువు మండలంగా ప్రకటించడంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల బుధవారం ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు నిలదీశారు. గ్రామాల్లో కేవలం రేషన్ బియ్యం మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన సరుకులు సరఫరా చేయలేదని సభ్యులు రెవెన్యూ అధికారులను నిలదీశారు.కోటవురట్ల ఎంపిటీసీ సభ్యులు సూర్యరావు సహా పలువురు సభ్యులు మాట్లాడుతూ, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని సభ దృష్టికి తీసుకువెళ్లారు. అన్నవరం ఎంపిటీసీ సభ్యురాలు శెట్టి రమణమ్మ జల్జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఒక ప్రాంతానికి నీరు వచ్చి మరో ప్రాంతానికి నీరు రాకపోవడం ప్రజల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు.ఇసుకను అక్రమంగా తరలించకపోతున్న రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం పట్ల జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు.తాండవ కాలువ నీలుగుంట వద్ద కల్వర్టు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ వరహాల బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు

నక్కపల్లి:మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ రత్నం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ అంబేద్కర్‌ను కోరారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు త్వరితగతిన పాసు పుస్తకాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.న్యాయంపూడి ఎంపిటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ, రేషన్ సరుకులు కందిపప్పు, పంచదార పూర్తిస్థాయిలో సరఫరా చేయాలన్నారు. పెదతీనార్ల ఎంపిటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 128లో మూడు ఎకరాల రాస్తా భూమిని ఒక వ్యక్తి కబ్జా చేశారని వెంటనే, భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. ఉపమాకలో డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలని సర్పంచ్ ప్రగడ వీరబాబు కోరారు. సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వ లేదని ఎంపీపీ అధ్యక్షతన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు కోరారు.

సిహెచ్‌సి సూపరింటెండెంట్ ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ, గుండు పోటు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి అత్యవసర స్టేమి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు పాల్గొన్నారు .



మండల సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ప్రసాద్

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -రావికమతం: పశువులకు సోకే గాలి కుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాద్ తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, పశువులుకు గాలికుంటు వ్యాధి సోకితే నోటి నిండా, గిట్టలలో బొబ్బలు ఏర్పడి మేత మేయలేని స్థితికి చేరుకుంటాయన్నారు. దీని నుంచి బయటపడేందుకు ప్రతి రైతు పెంపుడు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

జూదమాడితే చర్యలు

కేడీ పేట ఎస్ఐ ఉపేంద్ర



ప్రజాశక్తి-గొలుగొండ:సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో పేకాట, కోడిపందాలు నిర్వహించ రాదని కేడిపేట ఎస్సై ఉపేంద్ర హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట, ఇతర చట్ట వ్యతిరేక ఆటలు, జూద క్రీడలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



సిసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని 15, 16,21వ వార్డులో రూ.1.30కోట్లతో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతీ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కమిషనర్ రవిబాబు, 15వ వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, 16వ వార్డు కౌన్సిలర్ జగదీశ్వరి, 21వ వార్డు కౌన్సిలర్ వినీల చైతన్య, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ నార్త్..

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో గుడ్ మార్నింగ్ నార్త్ కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 43వ వార్డు పరిధి నందగిరినగర్, శ్రీనివాసనగర్, యలమంచిలి వారి వీధి ప్రాంతాల్లో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కలిసి క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, బిటి రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణి, ఎఇ రమణమ్మ, రహీం, నాయకులు జక్కంపూడి సత్యనారాయణ, హరిపట్నాయక్, బైర వెంకట్, తిరుపతిరావు, పద్మాశేఖర్, మహాదాస్య గోపి, ఠాగూర్, పారుపల్లి రవి, సతీష్, రామ, చంద్రకళ, వల్లి, ఖాదర్, రాణి, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

'నిరుద్యోగ యువతకు అన్యాయం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్వైసిపి పాలనలో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. బుధవారం నర్సీపట్నం ఎన్జీఒ హోమ్‌లో నియోజకవర్గ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ప్రతీ ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ తీస్తామని చెప్పి సిఎం జగన్ నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడంలో స్థానిక శాసనసభ్యులు విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువత గళం వినిపించేందుకు మరోవారం రోజుల్లో నర్సీపట్నంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అన్‌రాక్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ మెంబర్లు పినపోతుల నాగు, రామశేఖర్, మండల అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర ఆరోపించారు. నర్సీపట్నంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, డివైడర్ నిర్మాణంలో క్రషర్ బొగ్గును ఉపయోగిస్తున్నారన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డిసి అసిస్టెంట్ మేనేజర్

ప్రజాశక్తి -రావికమతం:మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రయాణికుల సౌకర్యవంతంగా తీర్చి దిద్దుదామని డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్ఎస్ నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో అద్దెకు ఇచ్చిన కాంప్లెక్స్‌ను ఆవరణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో షాపులలో అగ్రిమెంట్‌లో ఉన్న షాపులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఇకపై ఈ కాంప్లెక్స్ ఆవరణలో విధిగా బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సూపర్వైజర్ అధికారిని ఇక్కడ విధుల్లో ఉండే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంప్లెక్స్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీలింగ్ ఫ్యాన్లు కూడా అమర్చాలనే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ప్రయాణికులు తాకిడి పెరిగితే తాగునీరు, టాయిలెట్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ తనిఖీలో ఇంజనీరింగ్ విభాగం డీఈ నర్సింగరావు, విజిలెన్స్ అధికారులు చిట్టిబాబు, అప్పారావు ఉన్నారు.



పంపు సెట్లను అందజేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

పంపు సెట్ల మోటార్లు పంపిణీ

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని కొమరవోలు, ఎన్.కొత్తూరు గ్రామ పంచాయతీల్లో వైయస్సార్ జల కళలో భాగంగా పంపుసెంట్ మోటార్ కిట్లను రైతులకు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిడిఒ విజయ్ కుమార్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్లె రాము, ఎన్.కొత్తూరు సర్పంచ్ పోతల రాజశేఖర్, రోలుగుంట మండలం ఏపిఒ సూర్యమణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని గేదెలపాడులో తారు రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పనులకు గత యేడాది వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు స్థానిక సర్పంచ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సంవత్సరం నిరీక్షణ తరువాత ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభించారు. తారు రోడ్డు పనులను గన్నేరు పుట్టు సర్పంచ్ కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, పోరాటాల ఫలితంగా తారు రోడ్డు మంజూరైందని తెలిపారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ప్రత్యేక సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్రాంతి పండుగ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రత్యేక సినిమాను ప్రదర్శించారు. తమిళ సినిమా దర్శకుడు భారతి రాజా దర్శకత్వంలో 1985లో తమిళంలో రూపొంది తర్వాత తెలుగులో డబ్బింగ్ అయిన ఆత్మ బంధువు సినిమాను ప్రదర్శించారు. శివాజీ గణేశన్, రాధ నటించారు. అనేక ఫిల్మ్ ఫేర్ అవార్డులు పొందింది. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, పాత సినిమాలు ఆణిముత్యాలు అన్నారు. ఇటువంటి అపురూప చిత్రాలు చూసే అవకాశం వైజాగ ఫిల్మ్ సొసైటీ ద్వారానే సాధ్యం అని చెప్పారు. నగర ప్రజలు సభ్యులుగా చేరి మంచి సినిమాలు చూసే సంస్కృతిని పెంపొందించుకోవాలని కోరారు. చిత్ర ప్రదర్శన అనంతరం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, అనురాధ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

డివైఎఫ్ఐ నేతల అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మెగా డిఎస్సీని ప్రకటించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో సిఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారని, ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయించడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ తెలిపారు. బుధవారం నర్సీపట్నంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మెగా డిఎస్సీ ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అదిగో డిఎస్సీ ఇదిగో డిఎస్సీ అంటూ నిరుద్యోగులను నయవంచన చేసిందన్నారు. రాష్ట్రంలో కేంద్రం లెక్కల ప్రకారం 40వేల ఉపాధ్యాయు ఖాళీలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117 పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందన్నారు. తెలుగు మీడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందన్నారు. జగన్ ప్రభుత్వంలో 2వేల పాఠశాలలు మూసివేసిందని, ఇప్పటికేరాష్ట్రంలో, ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నాయని, ఇప్పుడు ప్రభుత్వం ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారన్నారు. దాదాపు రెండేళ్లలో 6లక్షల మంది విద్యార్థులు ఇలా డ్రాపౌట్ అయ్యారని గుర్తుచేశారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. అరెస్టులతో ఉద్యమాలను అపలేరని తెలిపారు. అక్రమంగా అరెస్టులను వెంటనే విరామించుకోవాలని, లేకుంటే ఎన్ని ధర్నాలకు అయినా వెనకడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు జ్ఞానేష్, శివ, కిరణ్, ప్రసాద్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో..

విధుల్లోకి పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో గత మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు తమకు జీతాలు పెంచాలంటూ విధులు బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో పారిశుధ్య ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై స్పందించిన పంచాయతీ సర్పంచ్ లోచల సుజాత పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీకి నిధులు ఏమి లేక పోవడంతో వేతనాలు పెంచడం కుదరన్నారు. మార్చి నెల నుంచి న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు విధుల్లో చేరారు.



పోలీస్ స్టేషన్‌లో డిఎస్సీ అభ్యర్థి

డిఎస్‌సి అభ్యర్థుల హౌస్ అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట:డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ముందస్తుగా అభ్యరుఓల అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో రోలుగుంటలో ఉన్న డిఎస్సీ అభ్యర్థిని హౌస్ అరెస్టు చేసి అనంతరం స్టేషన్‌కు తరలించారు.

30వ రోజుకు అంగన్‌వాడీ

-నోటీసులకు భయపడేది లేదు - పలు పార్టీలు, సంఘాల నేతల సంఘీభావం

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తే అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజు కొనసాగింది. అనకాపల్లి, విశాఖ జిల్లాలో పలు పార్టీల, సంఘాల నాయకులు అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు. నోటీసులకు భయ పడేదీ లేదని తేల్చి చెప్పారు.



విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 30 ఆకారంలో కూర్చుని నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి:అంగన్వాడీల సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక నెహ్రూ జంక్షన్లో రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్ రెడ్డి ప్రభుత్వం నిర్బంధంతో ప్రజా ఉద్యమాలను అణచలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, టిడిపి నాయకులు ఆడారి కిషోర్, కుప్పిలి జగన్, మల్ల గణేష్, కాంద్రేగుల సత్యనారాయణ, పూడి రమణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల రిలే దీక్షా శిబిరాన్ని బుధవారం జనసేన ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు సందర్శించి మద్దతు పలికారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, కంచిపాటి రాంబాబు, బలిరెడ్డి రామకష్ణ, బొడ్డపల్లి సూరిబాబు, అంగన్వాడీలు పాల్గొన్నారు. అలాగే దీక్షా శిబిరాన్ని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు సందర్శించి మద్దతు తెలిపారు.



నర్సీపట్నంలో...

మునగపాక : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, అంగన్వాడీలు జయలక్ష్మి, రామలక్ష్మి, అంజలి, హేమలత, సరస్వతి, శివ గణేష్ అమ్మ, లక్ష్మి, గంగాభవాని ,సత్యవతి, బి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో 30వ రోజు అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, యూనియన్ నాయకులు మంగ, సుజాత, నూక రత్నం, లక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంగన్‌వాడీలు సమ్మె 30వ రోజుకు చేరిన నేపథ్యంలో మండల కేంద్రంలో బుధవారం 30 సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, గౌరి, అమ్మాజి, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల ఆందోళన 30వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డోకల కుమారి, నాయకులు పి భవాని, సాయి లక్ష్మి, లక్ష్మీ ప్రభ, ప్రజా సంఘాల నాయకులు ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

మెకాళ్లపై నిరసన

అచ్యుతాపురం : మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బి.జయ, వరలక్ష్మి, రామలక్ష్మి తదితరులు మాట్లాడారు.



అచ్యుతాపురంలో...

పరవాడ : స్థానిక తాసిల్దార్ కార్యాలయం దీక్ష శిబిరం వద్ద అంగన్వాడీలు ఒంటి కాలుపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, ఎం రమణి వరలక్ష్మి కుమారి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నోటీసులు

బుచ్చయ్యపేట:తమ సమస్యలపై అంగన్వాడీలు 30 రోజులుగా సమ్మె చేస్తుండగా, ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన ప్రభుత్వం తక్షణమే విధులకు హాజరు కావాలని అంగన్వాడీలకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది, బుచ్చయ్యపేట, దిబ్బిడి, గున్నంపూడి, కొన్నంపూడి తదితర గ్రామాల్లో కార్యకర్తల ఇళ్లకు విఆర్ఒ, విఆర్ఎ, మహిళా పోలీసులు నోటీసులు అంటించారు. అంగన్వాడీలు సమ్మెలో భాగంగా ఆందోళన కార్యక్రమాలకు వెళ్లిపోవడంతో ఇంటి తలుపులకు నోటీసులు అంటించారు.

కశింకోట : కశింకోట మండలంలో అంగన్వాడి కార్యకర్తలు బుధవారం ఇంటికి నోటీసులు అంటిచారు. తాళ్ళపాలెంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ ఎస్.ఆదిలక్ష్మి, గ్రామ మహిళా పోలీస్ గీతా నోటీసులు అంగనాడీల ఇళ్లకు అంటించారు.

సబ్బవరం : మండలంలోని గంగవరం, అజనగిరి, వెదుల్లనరవ, కొత్తూరు గొల్లలపాలెం, పైడివాడ, అమృతపురం, చినగొల్లలపాలెం, పెదనాయుడుపాలెం, సబ్బవరం-1, 2, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, బంగారమ్మ పాలెం తదితర గ్రామాల్లో అంగన్వాడీలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. సచివాలయ మహిళ పోలీసులు ఈ నోటీసులను అంగన్వాడీల ఇళ్ల గోడలకు అంటించారు.

కె.కోటపాడు : సచివాలయం సిబ్బంది బుధవారం పలు గ్రామాల్లో అంగన్వాడీలు ఇళ్ల గోడలకు వెళ్లి నోటీసులు అతికించారు.

నర్సీపట్నం టౌన్:పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మినీ స్టేడియంలో 30 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీలు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల నిరాహారదీక్షలు

విశాఖ కలెక్టరేట్ : సమ్మె చేపట్టి 30 రోజులు అవుతున్న సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 30వ అంకె మాదిరి కూర్చుని అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం సరైనది కాదన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. జనసేన విశాఖ అర్బన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, సిపిఎం నాయకులు బి.పద్మ, సిపిఐ నాయకులు రెహమాన్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి. కుమార్, కార్యదర్శులు బి.జగన్, జి.అప్పలరాజు, పి.వెంకటరావు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు. సమ్మెలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.తులసి, వెంకటలక్ష్మి, శ్యామలాదేవి, రామలక్ష్మి పాల్గొన్నారు.

తగరపువలస: సమ్మెలో భాగంగా స్థానిక వై.జంక్షన్ వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ పి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాంబాబు మాట్లాడుతూ, ఐక్యంగా పోరాడితే దేన్నైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి, ఉమ, సుజాత, దుర్గ, తులసి, లావణ్య, సావిత్రి, భవాని, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్మా తగదు

గాజువాక : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ఉపయోగించడంపై భెల్ సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్, కె.విజయ్‌కుమార్, ఎస్.జగన్నాధరావు, పి.కన్నారావు, కె.నారపరెడ్డి, ఎస్.అప్పారావు, బి.కృష్ణమూర్తి, జి.చిన్నబాబు ఖండించారు. సరైన వేతానాలు చెల్లించకుండా ఎస్మా పేరుతో దండించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే వారితో చర్చించి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.



తగరపు వలసలో..